క్లుప్తంగా

అమ్మవారి పండగకు విరాళం



గ్రామ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న కార్తీక్

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 88వ వార్డు పరిధి యాదవజగ్గరాజుపేట గ్రామంలోని చింతాలమ్మ తల్లి పండగ మహోత్సవాలకు మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మనవడు డాక్టర్ పల్లా కార్తీక్ 25 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ నెల 25న అమ్మవారి పండగను వైభవంగా నిర్వహించేందుకు గ్రామ కమిటీ ఏర్పాట్లు చేయడంతో తన వంతు సహకారం అందించినట్లు తెలిపారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న కేకేఎస్ యూత్ ప్రతినిధులు

పెదగంట్యాడ: కన్యకా పరమేశ్వరి కళింగ కోమటి వెల్ఫేర్ అసోసియేషన్ (కేకేఎస్) ఆధ్వర్యంలో మండలంలోని కోరాడ జంక్షన్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం పాదచారులు, వాహనచోదకులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో బాటసారులకు ప్రతి రోజూ మజ్జిగ పంపిణీ చేయనున్నామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

మంత్రి అమర్‌నాథ్‌కు మొక్క అందజేత



మంత్రి అమర్‌నాథ్‌కు మొక్క అందిస్తున్న హుస్సేన్ కుటుంబం

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు జీవీఎంసీ 68వ వార్డు ముస్లిం నాయకుడు సయ్యద్ హుస్సేన్ మొక్కను బహూకరించారు. రంజాన్‌ను పురస్కరించుకుని అమర్‌నాథ్ హుస్సేన్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.

24న ఐపీఆర్‌పై ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

ఏయూక్యాంపస్: ప్రపంచ మేధోహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూ ఐపీఆర్ చెయిర్ ఆధ్వర్యంలో ఈ నెల 24న మేధో హక్కులపై ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహిస్తు న్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య హను మంతు పురుషోత్తం తెలిపారు. ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు ఈ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ముందుగా తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు మూడు నగదు పురస్కారాలు అందిస్తామని, పాల్గొన్న వారికి ఈ సర్టిఫికెట్లను అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు 95992 29217 నంబర్లో సంప్రదించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

గాజువాక: పవిత్ర రంజాన్ పండగను గాజువాక ప్రాంత ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకొన్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు ఈద్గా మైదానంతో పాటు మసీదుల్లో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

శాంతి సామరస్యాలకు నెలవు

గాజువాక ప్రాంతం శాంతి సామరస్యాలకు నిలయమని ఎమ్మెల్యే నాగిరెడ్డి అన్నారు. అన్ని మతాల వారు అన్నదమ్ముల్లా కలిసి జీవించడం ఈ ప్రాంత ప్రత్యేకత అన్నారు. ఈద్గా మైదానంలో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్న ఆయన ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, స్థానిక నాయకులు, ముస్లిం మత పెద్దలు దుబాయ్ బాషా, ఇర్ఫాన్, లుక్మాన్, బోటుభాయ్, సర్దార్, మోతీ, ఖాజా, షాహిద్ (బాబా), జలాల్, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

77వ వార్డులో..

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని పెదపాలెం, చినపాలెంలో ముస్లింలు మసీదుకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్‌కె నన్నా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనల్లో ముస్లిం పెద్దలు హుస్సేన్, అహ్మద్, జబ్బర్ పాల్గొన్నారు.

పెదమడక మసీదులో..

అగనంపూడి: రంజాన్ మాసం చివరి రోజున అగనంపూడి నిర్వాసిత కాలనీ పెదమడకలోని మసీద్ ఏ అబూబకర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిరుపేద ముస్లింలకు నిత్యావసర సరకులు అందించారు. కార్యక్రమంలో మసీద్ పెద్దలు మహమ్మద్ ఫిర్ ఆలీ, షేక్ అబ్దుల్ రహీమ్, షేక్ వలీభాయి, షేక్ హుస్సేన్, సిలారి, గ్రామ పెద్దలు నెల్లి శ్రీనివాసరావు, సత్యనారాయణ, పైడికొండ తదితరులు పాల్గొన్నారు.



77వ వార్డులో మసీదు వద్ద ముస్లింల సెల్ఫీ సందడి

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: ఉక్కునగరం మసీదులో ఉదయం ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. నమాజ్‌లో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దలు రంజాన్ ప్రాముఖ్యతను వివరించి ఖురాన్‌ను పఠించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. బంధుమిత్రులను ఇళ్లకు ఆహ్వానించి విందు ఏర్పాటు చేశారు. స్నేహితుల ఇళ్లకు వెళ్లి బహుమతులు అందజేశారు. మసీదు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



పెదమడక మసీదులో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న మత పెద్దలు

జగనన్నే మా నమ్మకం

- 'మా బిడ్డల భవిష్యత్తు జగన్' అంటున్న ప్రజలు
- టీటీడీ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి వెల్లడి
- 70వ వార్డు దశమికొండలో పర్యటన



వై.వి.సుబ్బారెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న నాయకులు



70వ వార్డులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న వై.వి.సుబ్బారెడ్డి

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్రంలో కోట్లాది మంది ప్రజలు 'జగనన్నే మా నమ్మకం, మా బిడ్డల భవిష్యత్తు జగన్' అంటూ నినదిస్తున్నారని టీటీడీ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. జీవీఎంసీ 70వ వార్డు దశమికొండ ప్రాంతంలో శనివారం రాత్రి నిర్వహించిన 'జగనన్నే మా నమ్మకం' కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఇంటి యజమానుల అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను గోడపై అంటించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీన 'జగనన్నే మా నమ్మకం' కార్యక్రమాన్ని ప్రారంభించామని, ఇప్పటికే కోటి మంది ప్రజలను కలిశామని తెలిపారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలంతా తమకు జగనన్న ఉన్నారనే భరోసా ఉందని తెలియజేస్తున్నారన్నారు. చంద్రబాబు పుత్రుడి పాదయాత్రను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. తండ్రీకొడుకులు ఎన్ని కుతంత్రాలు పన్నినా, పాదయాత్రలు చేసినా రాష్ట్ర ప్రజలు నమ్మడం లేదన్నారు. జగన్‌మోహన్ రెడ్డి వెంటే ప్రజలు ఉన్నారన్నారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డికి ప్రజలు అడుగడుగునా హారతులు పట్టి, స్వాగతించారు. నాయకులు గజమాలతో సత్కరించారు. కార్పొరేటర్ ఉరుకూటి చందు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, కార్యదర్శి ఉరుకూటి అప్పారావు, కార్పొరేటర్లు రాజాన రామారావు, బొడ్డు నర్సింహపాత్రుడు, భూపతిరాజు సుజాత, పి.వి.సురేష్, నాయకులు గుడివాడ లతీష్, ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోగాది సన్యాసిరావు, మార్కెటింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ పల్లా చినతల్లి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ, మంత్రి రాజశేఖర్, గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం పాల్గొన్నారు.

ఉక్కు క్రీడాకారులకు క్రికెట్ కిట్ బహూకరణ



క్రీడాకారులతో ఆస్ట్రేలియా క్రికెట్ కోచ్ వెంకటరావు, అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ క్రికెట్ క్రీడాకారులకు శనివారం క్రికెట్ కిట్‌ను బహూకరించారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ లెవెల్-2 కోచ్ వెంకటరాజు ఇటీవల ఉక్కు స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎర్రమట్టి పిచ్, ఆట మైదానాలను ముఖ్య అతిథిగా ప్రారంభించారు. స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారుల అవసరాలను గుర్తించిన వెంకటరాజు స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ క్రికెట్ టీమ్‌కు అవసరమైన రెండు ఇంగ్లీష్ విల్లో బ్యాట్లతో కూడిన పూర్తి కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులకు పలు మెలకువలు వివరించారు. నిత్యం ప్రాక్టీస్ చేయడంతోనే మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని సూచించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం మాజీ జీఎం ఎం.ఎస్. కుమార్, ఇన్‌చార్జి సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, విభాగం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద పాము కలకలం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం వద్ద పాము కలకలం రేపింది. స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్ వచ్చేవరకు స్థానికులు ఆందోళన చెందారు. పామును పట్టుకున్న అనంతరం ఊపిరి పీల్చుకున్నారు. వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ పరిపాలనా భవనం ఎదురుగా ఉన్న ప్రైవేటు షాపు నిర్వాహకులు ఉదయం షాపు తెరిచేందుకు రాగా, అక్కడ పాము తిరుగుతూ కనిపించింది. దాంతో ఆయన కంగారుతో ఎదురుగా ఉన్న పరిపాలన భవనం వద్ద వెళ్లారు. అక్కడున్న వ్యక్తులకు చెప్పడంతో వారు వచ్చి చూసి, వెంటనే స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్‌కు సమాచారం అందించారు. కిరణ్‌కుమార్ కొంతసేపటికి అక్కడికి చేరుకుని పాము కోసం వెదికారు. ఎట్టకేలకు సుమారు నాలుగు అడుగుల పొడవు కలిగిన నాగజెర్రిని పట్టుకుని, అక్కడి నుంచి తరలించారు.



పట్టుకున్న నాగజెర్రితో స్నేక్‌క్యాచర్ కిరణ్‌కుమార్

తిప్పల అరుణకు వైవీ సుబ్బారెడ్డి నివాళి

పెదగంట్యాడ: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గాజువాక వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు తిప్పల చినఅప్పారావు సతీమణి, కార్మిక నాయకుడు పులి భూలోకరెడ్డి కుమార్తె తిప్పల అరుణ కుటుంబ సభ్యులను టీటీడీ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి శనివారం పరామర్శించారు. ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుమారులు తిప్పల నితీష్ రెడ్డి, సురేష్ రెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వైవీ సుబ్బారెడ్డి వెంట ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత, బొడ్డు నర్సింహపాత్రుడు, నాయకులు ఉన్నారు.



తిప్పల అరుణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైవీ సుబ్బారెడ్డి తదితరులు

'చంద్రబాబుకు దళితులపై చులకన భావం'

అక్కిరెడ్డిపాలెం: చంద్రబాబు దళితులపై చులకన భావంతో వ్యవహరిస్తున్నారని విశాఖ జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ బోనెల జోసెఫ్ అన్నారు. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో చంద్రబాబు వ్యవహరించిన తీరును ఒక ప్రకటనలో విమర్శించారు. మంత్రి ఆదిమూలపు సురేష్‌పై చంద్రబాబు తన కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు పాల్పడేటట్టు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. చంద్రబాబు పాలనలో స్వయంగా ఒక మంత్రి విశాఖ జిల్లా పెందుర్తి మండలం, జెర్రిపోతుల పాలెంలో ఒక దళిత మహిళను వివస్త్రను చేసి దాడి చేసిన విషయం అందరికీ తెలిసిందే అని పేర్కొన్నారు. 'ఎవరైనా దళితులుగా పుట్టాలనుకుంటారా' అని విలేకరుల సమావేశంలో చంద్రబాబు స్వయంగా దళితులను అపహాస్యం చేశారని గుర్తు చేశారు. ఇందుకు పూర్తిగా భిన్నమైన నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని తెలిపారు. దళితుల పక్షపాతి అని కొనియాడారు. రాష్ట్రంలో దళితులంతా సీఎం జగన్ వెంటే ఉన్నారని తెలిపారు.

జీవీఆర్ నాయుడు సేవలు అభినందనీయం

అక్కిరెడ్డిపాలెం: విధి నిర్వహణలో జి.వి.ఆర్.నాయుడు చేసిన సేవలు ఎంఎస్ఎంఈ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని వాసీవా అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ అన్నారు. ఎంఎస్ఎంఈ ఇన్‌చార్జి ఏడీగా విధులు నిర్వర్తించి, ఉద్యోగ విరమణ చేసిన జి.వి.ఆర్.నాయుడును వాసీవా ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఉన్నతోద్యోగులు, అధికారులు మాట్లాడుతూ నాయుడు క్రమశిక్షణను కొనియాడారు. అనంతరం నాయుడు దంపతులను వాసీవా, ఐలా, ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్స్, ఒడిశా ఎంఎస్ఎంఈ అధికారులు, ఫ్యాప్సీ అధికారులు, పలువురు పారిశ్రామికవేత్తలు ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు బహూకరించారు. వాసీవా ఉపాధ్యక్షుడు ఇ.కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐలా కమిషనర్ కె.సూర్యనారాయణ, ఛైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి చీకటి సత్యనారాయణ, ఒడిశా ఎంఎస్ఎంఈ రిటైర్డ్ బ్రాంచ్ మేనేజర్ పంచేంద దాస్, ఫ్యాప్సీ అధ్యక్షుడు వాసిరెడ్డి మురళీకృష్ణ, పెదగంట్యాడ అధ్యక్షుడు సత్యనారాయణ, వాసీవా కార్యదర్శి బి.ఎస్.రావు, ఐలా మాజీ ఛైర్మన్లు వై.సాంబశివరావు, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



జి.వి.ఆర్.నాయుడును సన్మానిస్తున్న ఐలా కమిషనర్, ప్రతినిధులు

పవర్ లిఫ్టింగ్‌లో సత్తా చాటిన జ్యోత్స్న, హర్షిత

విశాఖ స్పోర్ట్స్: ఏపీ అంతరజిల్లాల మెన్, వుమెన్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో జ్యోత్స్న, హర్షిత మొత్తంగా 300+కేజీల బరువును ఎత్తి సత్తా చాటారు. రెండు రోజుల పాటు సబ్ జూనియర్స్, జూనియర్స్‌తో పాటు మాస్టర్స్‌కు ఈ పోటీలు స్క్వాట్, బెంచ్‌ప్రెస్‌తో పాటు డెడ్‌లిఫ్ట్ అంశాల్లోనూ జరగనున్నాయి. ఏయూ ఇండోర్ జిమ్నాజియంలో తొలిరోజు సబ్ జూనియర్ బాలికల 43 కేజీల వెయిట్ కాటగిరీలో ఎం. షనూన్ స్క్వాట్‌లో 75 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 27.5కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 90 కేజీలతో మొత్తంగా 192.5కేజీల బరువునెత్తి తొలి స్థానంలో నిలిచింది. బి.దీక్షిత, సీహెచ్ దౌలత్శ్రీ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 52 కేజీల బరువులో ఎ.జ్యోత్స్న స్క్వాట్‌లో 140 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 70 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 135 కేజీలతో మొత్తంగా 345 కేజీల బరువునెత్తి తొలి స్థానంలో నిలిచింది. ఎ.ప్రవల్లిక, కే.ఆశ్రిత వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 57 కేజీల వెయిట్‌లో ఎస్.కృష్ణవేణి స్క్వాట్‌లో 80 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 42.5 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 100 కేజీలతో మొత్తంగా 222.5 కేజీల బరువునెత్తి తొలిస్థానంలో నిలిచింది. ఆర్.వందన, ఎం.జనని వరుసగా ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. 63 కేజీల వెయిట్‌లో హర్షిత తివారి స్క్వాట్‌లో 125 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 60 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 140 కేజీలతో మొత్తంగా 325 కేజీల బరువునెత్తి తొలిస్థానంలో నిలిచింది. ఎస్.లక్ష్మి, ఎం.పూర్ణిమ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 69 కేజీల వెయిట్‌లో జి.సుభాషిణి స్క్వాట్‌లో 120 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 45 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 125 కేజీలతో మొత్తంగా 290 కేజీల బరువునెత్తి తొలి స్థానంలో నిలిచింది. ఎస్.షైనీ, పి.భానుశ్రీ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

800వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం మొదలై 800 రోజులు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరి కాదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్‌పరం చేస్తే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 800వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఉక్కు కార్మికులకు మద్దతుగా ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న మోదీ ప్రభుత్వానికి ప్రజలు, కార్మికులు కలిసి, అదే రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతో గట్టి బుద్ధి చెప్తారన్నారు. ఎందరో కార్మికుల బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని కేంద్రప్రభుత్వం వెంటనే ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

రైతుల కోసం డ్రోన్ల రూపకల్పన



డ్రోన్లతో విజ్ఞాన్ విద్యార్థులు, సిబ్బంది

అగనంపూడి: వ్యవసాయ రంగంలో ఉపయోగించడానికి రెండు నూతన డ్రోన్లను విద్యార్థులు ఆవిష్కరించడం సంతోషంగా ఉందని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. వ్యవసాయ రంగంలో ఎరువులు, పురుగుల మందులు చల్లేందుకు వీలుగా దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం చివరి సంవత్సరం విద్యార్థులు ఈ డ్రోన్లను రూపొందించినట్లు చెప్పారు. మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు ఆరోగ్యపరమైన సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఒక డ్రోన్‌ను ఆవిష్కరించారన్నారు. అలాగే రిమోట్ సహకారం లేకుండా నిర్దేశించిన గమ్యాన్ని, చేరుకోవడానికి ఆటో మిషన్ డ్రోన్‌ను కూడా కనుక్కోవడం జరిగిందన్నారు. ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, విభాగాధిపతి బి.ప్రసాద్, డీన్ ఏఎంఆర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నేల తల్లిని స్మరించే గొప్ప సంస్కృతి మనది

ధరిత్రి దినోత్సవంలో చినజీయర్ స్వామి అనుగ్రహభాషణం



ప్రసంగిస్తున్న చినజీయర్ స్వామి

ఏయూక్యాంపస్: పుడమి పరిరక్షణలో ప్రతి వ్యక్తి తన బాధ్యతను గుర్తెరిగి నడచుకోవాలని చినజీయర్ స్వామి అన్నారు. శనివారం సాయంత్రం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో వికాస తరంగిణి నిర్వహించిన మన భూమి మన బాధ్యత కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. విశ్వంలో సమస్త ప్రాణికోటితో మానవ జీవనం ముడిపడి ఉందనే విషయం విస్మరించరాదని సూచించారు. నిత్యం ఉదయం నిద్రలేస్తూనే నేలతల్లిని నమస్కరించి, స్మరించే గొప్ప సంస్కృతి మన సొంతమన్నారు. మనమంతా నేలతల్లి ఒడిలో ఆటలాడే పిల్లలమన్నారు. ధరిత్రీ పరిరక్షణకై మనలో మనం ఆలోచన చేయాల్సిన అవసరాన్ని వివరించారు. నేలను తల్లిగా భావించడం వేదకాలం నుంచి ఉందన్నారు. విశ్వంలో మన స్థానం ఏంటని ఒకసారి మానవులు ప్రశ్నించుకోవాలన్నారు. గాలి,నీరు, ప్రాణికోటి బాగుంటేనే మనం బాగుంటామనే విషయం మరువకూడదన్నారు.

అహోబిల జీయర్ స్వామి మాట్లాడుతూ యువశక్తి సమాజ హితాన్ని కాంక్షించాలన్నారు. ఆదర్శవంతమైన జీవనం సాగించడం అలవరచుకోవాలని సూచించారు. మంచి భావన వలన మంచి ఫలితం కలుగుతుందన్నారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ప్రతి ప్రాణిని సంరక్షిస్తూ ధరిత్రిని కాపాడాలని పిలుపునిచ్చారు. పుడమి కేవలం మనుషులదే అనుకోవడం సరి కాదన్నారు. ఏయూ నిర్వహించే కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల్లో జీయర్ స్వామి నిర్వహించే కార్యక్రమాలు అనుసంధానం చేయాలని కోరారు. సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రకృతిని విస్మరిస్తే ముప్పు తప్పదనే విషయాన్ని కథ రూపంలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు టి.టి.వి. రమణ మూర్తి, సాతులూరి రామానుజం, పి.పద్మనాభ రావు, నారాయణ రెడ్డి, అడుసుమిల్లి రాము తదితరులు ప్రసంగించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను, ధరిత్రీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీలలో విజేతలైన విద్యార్థులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.